


***(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)***

## 101

(12' డిసెంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**అప్పిచ్చేవాడు,** వైద్యుడు ఎండిపోని జలాశయం, ద్విజుడు - ఈ వసతులు గల గ్రామంలో వుండమన్నాడు సుమతీ శతక కర్త.

ఈ కాలానికి సంబంధించిన అర్థంతో పరిశీలిస్తే పైన చెప్పిన ద్విజుడు అన్న వాక్యానికి రాజకీయవేత్త అని చెప్పుకోవచ్చు. మరి వారికి రెండు జన్మలుంటాయి ఏ కులానికి చెందిన వ్యక్తి అయినా రాజకీయవేత్తగా మారడమే మరో జన్మగా భావివించబడవచ్చు.

అలాటి రాజకీయ వేత్త గ్రామంలో లేకపోతే పనులు కావడం కష్టం. ఆయన శాసన సభ్యుడో, శాసనమండలి సభ్యుడో, యింకా అదృష్టం బాగుండి లోక్‌సభ సభ్యుడో అయితే మరీ మంచిది.

తమ గ్రామాన్ని తాను బాగుచేసుకోవడం కోసం ఆయన తగిన శ్రద్ధవహించి, ప్రభుత్వ కార్యాలయాలలో వున్న ఎర్రబద్దలను కత్తిరించి ఎలాగో అలా తన గ్రామానికి అవసరమైన సౌకర్యాలు కొన్ని కల్పించుకోగలుగుతాడు.

కనుక ఈనాడు సుమతీ శతకర్త చేసిన సూచనల్లో ముఖ్య సూచిక ఒకటి నెరవేరిందనే చెప్పాలి. పోతే గ్రామంలో ఎక్కువమంది ద్విజులుంటే లాభమో నష్టమో ఆయన తెలియచెయ్యలేదు.

జలాశయాల విషయం. ఆ ద్విజులు ఏర్పడిన తర్వాత జలాశయాల విషయం ఎక్కువగా ఆలోచించవలసిన అవసరంలేదు. వారు తలుచుకుంటే భగీరధిని తెచ్చి చూరు చుట్టూ ప్రవహింపచేయగలరు.

అన్ని గ్రామాలలో చెరువులు, నూతులు, బోరింగ్ పంపులు ఏర్పడుతున్నాయి. ఈ కార్యక్రమానికి అవసరమైన సహాయంతో లభిస్తోంది. ఎక్కడ ఒక మంచినీళ్ళ బావి త్రవ్వినా ఒక మంత్రి మహాశయుడు వచ్చి ఆ మహత్కార్యాన్ని అభినందించి, ప్రారంభోత్సవం చేసి సంతృప్తి చెందుతున్నాడు.

పూర్వకాలంలో వలె గాక ఈనాడు దాళ్వా పంటలు, చెరుకు పంటలు వగైరాలకుగాను కాల్వలు వేసవిలో కూడా వదులుతున్నారు. పొలాలు పండినా, పండకపోయినా కాలువల్ని మాత్రం ఎండనీయడం లేదెంతమాత్రం. కనుక యిప్పుడు ఎడతెగ బారుయేరులు ప్రతి గ్రామంలో ఏర్పడినాయనే చెప్పాలి.

సుమతీ శతకకర్త చెప్పిన జాబితాలో వైద్యుని మాట ఒకటి వుంది. ఈనాడు చాలా గ్రామాలలో ఆస్పత్రులు వెలుస్తున్నాయి. రోగాలకి ప్రముఖ కేంద్రాలైన పట్టణాల్ని, నగరాల్ని వదిలి వెళ్ళడానికి డాక్టర్లు జాలివెలిబుచ్చుతున్న గ్రామాలలో కూడా డాక్టర్లను నిత్య ప్రత్యక్షం చెయ్యాలనే కృషి జరుగుతోంది.

అదిగాక ప్రతి గ్రామానికి రోడ్లు వేయడం వల్ల దరిదాపుల్లో పట్టణాలలో గల ఆస్పత్రులకు అనతికాలంలో చేరే అవకాశాలు కూడా ఎక్కువ అవుతున్నాయి. కనుక ఏదో విధంగా గ్రామాలకు వైద్య సౌకర్యాలు ఉన్నాయనే చెప్పాలి. మారుమూల గ్రామాలక్కూడా డాక్టర్లను పంపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నందువల్ల వైద్య సమస్య పరిష్కారమవుతున్నదనే చెప్పాలి.

గ్రామాలకు వైద్య సౌకర్యాల విషయంలో ప్రసంగిస్తూ ఒక పెద్దమనిషి అన్నారు. "ఈ విషయంలో ఎక్కువగా చింతపడక్కరలేదు. రోగాలు గ్రామాలకు వాటంతటవే ప్రాకుతున్నాయి గనుక వాటి వెంట డాక్టర్లు పరుగులు తీసే అవకాశాలు ఏర్పడి తీరుతాయి" అన్నారు.

పోతే ఇక అప్పిచ్చువాడు అనే విషయం మిగిలింది. పూర్వం రైతుల ఋణాల బాధలో చిక్కుకుపోయారని వాళ్ళను ఆ ఒత్తిడిలో నుంచి, ధనికవర్గం పిడికిలిలో నుంచి తప్పించాలని నినాదాలు వినిపిస్తూ వుండేవి.

ఇక ప్రజాస్వామాన్యం విషయంలోకి వస్తే అప్పు ఇవ్వాలంటే ప్రాణాలు ఒప్పేవి కాదు. ధనికులకు, వడ్డీ మురిపాల వల్ల కొందరు అప్పుకోరిన వాళ్ళ గొంతులకు మూడు పీట ముళ్ళు వేసి చేత్తో పట్టుకుని, కొద్దిగా విదిల్చేవారు.

అప్పుతెచ్చిన వాళ్ళు వాళ్ళ తరంలో వడ్డీ కూడా తీర్చలేక సతమతం కావడం - రెండో తరం వాళ్ళు ఆ బాధలు పడలేక ఆస్తులు పూర్తిగా అమ్మి ఋణబాధ నుంచి విముక్తులై, పాపర్ల జాబితాల్లో పడి, ఏ పట్టణాలో పట్టుకు లేచిపోవడం జరుగుతూ వుండేది.

హామీలు పెట్టడానికి ఆస్తులు లేని వాళ్ళు ఎంత చిన్న అప్పు తేవడానికైనా పడరాని అవస్థలు పడుతూ వుండేవారు. ఋణదాత మనస్సు కరిగించడానికి వాళ్ళు ఎన్నెన్నో పాట్లు పడేవారు.

అప్పు అడగాలనుకున్నప్పుడు వెంటనే అడగలేక కొంతకాలం "వంశాను క్రమణికగా వారిని కీర్తించడం. వాళ్ళ వాకిళ్ళలో ఉన్న ఆల్ సే యస్ శునకం మీద చేతనైతే శతకం వ్రాసి యజమాని వినేటట్లుగా ప్రతిరోజూ చదవడం"

ఆయన మెచ్చుకుంటున్నాడనే భావం కలిగిన తర్వాత, ఆ శతకాన్ని "మీ వంశంలో ఎవరు కోరితే వారికి అంకితమిస్తా"నని హామీ ఇవ్వడం, ఆ తర్వాత అప్పు సంగతి బయటపెట్టడం జరుగుతూ వుండేవి. ఇంత యజ్ఞం చేసినా ఒకప్పుడు ఫలితం సిద్ధించకపోవడం జరుగుతూ వుండటం కద్దు. ఒకపుడు సత్వరం ఫలితం ప్రాప్తించడం అక్కడితో "ఋణగ్రస్థ" జీవితం ప్రారంభం కావడం సంభమవుతూ వుండేవి.

అలాటికాలం చాలావరకూ మారిపోయింది. అప్పుల అవసరం ఎప్పటిలాగానే వుంది. కొంచెం ఆలోచిస్తే అప్పటికంటే కొంచెం ఎక్కువైందని కూడా చెప్పాలి. కాకపోతే అప్పు అడగడానికి అంత అవస్థ పడటంగానీ తీర్చడానికి దిగులుపడటంగాని చేయటంలేదు. అప్పు చెయ్యడం ఒక పురుష లక్షణంగా, తీర్చలేక పోవడం ఒక దేవతా చేష్టగా మారిపోయింది ఇప్పుడు. అప్పు తీసుకునేవారిలో లోకువా, ఇచ్చేవారిలో ఒక రకం లోకువా కనిపిస్తున్నాయి ఈనాడు. లోకువ అంటే మరేది కాదు. అప్పివ్వడం ఆలస్యమైతే ఎందుకివ్వరు అని అడిగే అవకాశాలు వచ్చాయి. అంటే వెనుకటి భయం తగ్గి చనువూ, స్వాతంత్ర్యం ఏర్పడినాయిగదా.

ఇప్పుడింకో క్రొత్త అధ్యాయం వెలసింది. "అప్పుల భారతం"లో. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా, ఎవరికి పడితే వారికి (అయితే కొన్ని షరతుల ననుసరించేననుకోండి) అప్పులివ్వడం ప్రారంభించింది. "అప్పులు ఇవ్వబడును" అని ప్రకటనలు కూడా జరుగుతున్నాయి.

కొన్ని కొన్ని సాంకేతిక రంగాలలో అనుభవం కలవారికి, ఎలాటి హామీలూ కోరకుండానే వారి శక్తి సామర్థ్యాలను ఆధారం చేసుకుని, అప్పులిచ్చి, వారి శ్రామిక రంగాన్ని అభివృద్ధి పరచడానికి శాయశక్తులా కృషి చేయడానికి పూనుకుంది ప్రభుత్వం.

"పరిశ్రమలు స్థాపించండి.

వ్యవసాయం దిగ్విజయంగా కొనసాగించండి.

వ్యాపారాలు తలపెట్టండి.

మీకు నచ్చిన వృత్తులు చేపట్టండి.

పాడిని అభివృద్ధి పరచండి.

ఫలవృక్షాల వీపు చరిచి, పండ్లు కాయించండి.

మీకు తోచింది చెయ్యండి.

దేశాభివృద్ధి భారం వహించండి.

సోమరితనాన్ని వెనక్కు నెట్టండి.

మొదలు పెట్టండి కార్యక్రమం.

అర్జీ మా చేతులలో వుంచండి.

మీకు ధన సహాయం చేస్తాం. "

అంటూ బ్యాంకులు అప్పీళ్ళు చేస్తున్నాయి. అడిగినవారికల్లా అప్పులిస్తున్నాయి. బ్యాంకుల జాతీయకరణంలో ప్రథమాధ్యాయం నిర్విఘ్నంగా కొనసాగుతోంది. సోషలిస్టు వ్యవస్థాపనకు నాందీగీతంగా లక్ష్మి వూరువూరా, వాడవాడా ఇంటింటా సంచారం చేస్తోంది.

లక్ష్మి ప్రసన్నం ఇంతగా మున్నెన్నడు జరగలేదనీ, ఆమె ఉదారత 'ఇందిరా రాజ్యంలో' ప్రదర్శించినట్లు మరెప్పుడూ ప్రదర్శించలేదనీ ప్రజానీకం చెప్పుకుని ఎంతో మురిసిపోతున్నారు.

ఋణాలు తీసుకున్నవారు గర్వంతో నిలబడగలుగుతున్నారు. సుమతీ శతక కర్త కోరిన "అప్పిచ్చువాడు" ఇప్పుడు "ఇందుగలడందులేడను సందేహము లేదు, దాత సర్వోపగతుండు" అనిపించుకుంటాడు. అంతకంటే ఏం కావాలి?

Post your comments